పువ్వాడ ఇంటికి బీఆర్ఎస్ అధినేత

కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పువ్వాడ కుటుంబ సభ్యులు

ఖమ్మం, ఏప్రిల్ 30 : సీపీఐ జాతీయ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావును బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం ఖమ్మంలోని వారి నివాసానికి వెళ్లి పరామర్శించి, ఆరోగ్య యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పువ్వాడ నాగేశ్వరరావు కేసీఆర్‌కి పుష్పగుచ్ఛం ఇచ్చి సాదరంగా స్వాగతం పలికారు. కేసీఆర్ వెంట మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, నాయకులు ఉన్నారు.

రైతుబిడ్డ 'నామా'ను గెలిపించండి

మధుకాన్ చైర్మన్ నామా కృష్ణయ్య

మాట్లాడుతున్న చైర్మన్ నామా కృష్ణయ్య

కూసుమంచి (నేలకొండపల్లి), ఏప్రిల్ 30: రైతుబిడ్డ నామా నాగేశ్వరరావును మరోసారి కూడా గెలిపించాలని మధుకాన్ మధుకాన్ షుగర్ ఫ్యాక్టరీ చైర్మన్ కృష్ణయ్య కోరారు. స్థానిక చెరకు రైతుల సమస్యలనే కాకుండా దేశంలోని చెరకు రైతుల సమస్యలను కూడా ఆయన ఎన్నోసార్లు పార్లమెంటులో ప్రస్తావించారని గుర్తుచేశారు. నష్టాల్లో ఉన్న మధుకాన్ ఫ్యాక్టరీని తీసుకొని రైతులకు అండగా నిలబడ్డారని అన్నారు. నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురంలోని మధుకాన్ షుగర్ ఫ్యాక్టరీలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 49 చెక్కర ఫ్యాక్టరీలుండగా వాటిల్లో 38 పరిశ్రమలు మూతపడ్డాయని, ప్రస్తుతం 11 ఫ్యాక్టరీలు మాత్రమే మిగిలి ఉన్నాయని అన్నారు. చక్కెర కర్మాగారాలు మూతపడడంతో ఎంతోమంది రైతులు, కార్మికులు ఉపాధి కోల్పోయారని గుర్తుచేశారు. చక్కెర కర్మాగారాలు కొంత కష్టకాలంలో ఉన్నప్పటికీ ఇక్కడి రైతుల కోసం తాము మధుకాన్ ఫ్యాక్టరీని నడిపిస్తున్నామని అన్నారు.ప్రభుత్వం కూడా వరి పంట మాదిరిగా చెరకు పంటకు రూ.500 బోనస్ ఇస్తే రైతులను ఆదుకున్నట్లవుతుందని అన్నారు. అనంతరం ఫ్యాక్టరీ సీజీఎం యార్లగడ్డ కోటయ్య మాట్లాడుతూ.. మధుకాన్ ఫ్యాక్టరీ ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ రైతుల శ్రేయస్సు కోసం వారికి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని అన్నారు. కేన్ డీజీఎం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీవి విద్వేషపూరిత రాజకీయాలు: ఎమ్మెల్యే కూనంనేని

ఖమ్మం కమాన్‌బజార్ ఏప్రిల్ 30 : బీజేపీ విద్వేష పూరిత రాజకీయాలు చేస్తూ ప్రజలను మోసం చేస్తుందని ఇది అత్యంత దురదృష్టకరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. దేశ ప్రధాని వ్యాఖ్యలు దిగజారుడు తనానికి అద్దం పడుతున్నాయని ఆయన తెలిపారు. మంగళవారం ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ పదేళ్ళ కాలంలో ఇచ్చిన ఏ హామీని నిలబెట్టుకోలేదన్నారు. ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు మౌలాన, జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్‌ల తనిఖీ

చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేస్తున్న పోలీస్ కమిషనర్

వైరారూరల్, ఏప్రిల్ 30 : అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అన్నారు. వైరా అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని గన్నవరం-నెమలి-దాచాపురం టి జంక్షన్ వద్ద గల అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్‌లను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధుల్లో ఉన్న సిబ్బంది కేంద్ర బలగాలకు పలు సూచనలు చేశారు. వాహన తనిఖీల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీస్ వాహనాలతో సహా అన్ని ప్రభుత్వశాఖలకు చెందిన వాహనాలను సైతం తనిఖీ చేయాలన్నారు. తనిఖీల్లో మద్యం, మాదకద్రవ్యాలు వంటి అక్రమ తరలింపులను గుర్తించి సీజ్ చేసే సమయం లో వీడియోగ్రఫీ చేయించాలన్నారు. ప్రజలు ఎవరైనా నగదును వెంటబెట్టుకొని ప్రయాణాలు చేయాల్సి వస్తే సరైన ఆధారాలు కలిగి ఉండాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి తూచా తప్పకుండా అమలయ్యేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. నగదు, మద్యం విలువైన వస్తువులు, డ్రగ్స్ లాంటి అక్రమ రవాణాను నిరోధించడంలో భాగంగా పోలీస్, రెవెన్యూ, ఫారెస్ట్, రవాణా, వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ తదితరశాఖలతో అంతరాష్ట్ర, అంతర్ జిల్లా సరిహద్దుల వెంట ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేసి రౌండ్ ది క్లాక్ పటిష్టంగా తనిఖీలు చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు చెక్‌పోస్ట్‌లలో నిరంతరం 24 గంటల పాటు తనిఖీలు నిర్వహించాలన్నారు.

ఎన్నికల ఫిర్యాదులు ఉంటే కాల్ చేయాలి

మామిళ్లగూడెం, ఏప్రిల్ 30 : లోకసభ సాధారణ ఎన్నికలు-2024 దృష్ట్యా ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఫిర్యాదులు ఏమైనా ఉంటే వెంటనే తెలియజేయాలని ఎన్నికల ఎక్స్పెండిచర్ అబ్జర్వర్స్(వ్యయ పరిశీలకులు) అరుణ్ ప్రసాద్ కృష్ణసామి కోరారు. ఖమ్మం, పాలేరు, మధిర అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందినవారు ఫోన్ నెంబర్ 9398560944, వైరా, సత్తుపల్లి, అశ్వారావుపేట, కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గాల వారు ఫోన్ నెంబర్ 9398559986కు ఫోన్ చేసి తెలపాలన్నారు. మంగళవారం ఎన్నికల ఎక్స్పెండిచర్ అబ్జర్వర్స్ ఒక ప్రకటనలో సాధారణ ఎన్నికల దృష్ట్యా ఖమ్మం లోకసభ నియోజకవర్గ ఎన్నికల్లో వ్యయానికి సంబంధించిన ఉల్లంఘనలు, ఫిర్యాదులు ఏమైనా ఉన్నట్లైతే, వాటిని స్వయంగా స్వీకరించడానికి ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఖమ్మం జిల్లా ప్రజా పరిషత్ గెస్ట్‌హౌజ్‌లో అందుబాటులో ఉంటామని తెలిపారు. తమకు వచ్చే ఫిర్యాదులపై స్పందించి చర్యలు తీసుకుంటానని వారు పేర్కొన్నారు. ఎవరైనా ఫిర్యాదు చేయదలచిన వారు స్వయంగా గాని లేదా ఫోన్ ద్వారా గాని ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు.

పోలీస్ సిబ్బందికి సన్మానం

ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ సిబ్బందిని సన్మానిస్తున్న సీపీ సునీల్‌దత్

మామిళ్లగూడెం, ఏప్రిల్ 30 : ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో ఎస్సైలు యండీ.అహమ్మద్, యండీ.సత్తార్, వి.భద్రు, ఏఎస్సైలు ఆర్.శౌరీ, డి.వెంకటేశ్వర్లు, హెడ్‌కానిస్టేబుల్ వి.సీతరామారావు ఉన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన నరేష్‌కుమార్, ఏఆర్ ఏసీపీ సుశీల్‌సింగ్, ఆర్ఐ కామరాజు, పోలీస్ అసోసియేషన్ నాయకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'టెన్త్' ఫలితాల్లో మధు విద్యాలయం ప్రభంజనం

విద్యార్థులకు స్వీట్లు తినిపిస్తున్న పాఠశాల యాజమాన్యం

వైరాటౌన్, ఏప్రిల్ 30: పదో తరగతి ఫలితాల్లో వైరా పట్టణానికి చెందిన మధు విద్యాలయం విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. భాగం కార్తీక్, శీలం అఖిలేందర్‌రెడ్డి 9.8, కంభం అమూల్య 9.7, బోగి సంపత్, చల్లగుండ్ల తనుష్, ఇండ్ల వరుణ్ 9.5, షేక్ ఇమ్రాన్, దురిశెట్టి సంజ్ఞిత 9.3, మేకల దిలీప్ 9.2, చిట్రోజు ఉజ్వల, సూతగాని అక్షయ, కారుమంచి తేజశ్రీ 9.0 జీపీఏలు సాధించినట్లు మధు విద్యాలయ సంస్థల సెక్రటరీ మల్లెంపాటి వీరభద్రరావు తెలిపారు. విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, అధ్యాపకబృందం అభినందించారు.